సాక్షి
రంగారెడ్డి
గురువారం । 23 । మే । 2024



అసంపూర్తి పనులు..

అసెంబ్లీ ఎన్నికలకు ముందు హడావుడిగా నిధులు మంజూరు చేశారు.. టెండర్లు సైతం పూర్తి చేశారు.

8లో ▸



బిల్లులు చెల్లించాలి

అభివృద్ధి పనులు చేసినా, నేటికి బిల్లులు అందక ఇబ్బందులు పడుతున్నామని మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు.

8లో ▸



పత్తి విత్తనాల పట్టివేత

నిషేధిత పత్తి విత్తనాలను తరలిస్తున్న ఆటోను ఎస్ఓటీ, శంకర్‌పల్లి పోలీసులు పట్టుకున్నారు.

8లో ▸

న్యూస్‌రీల్

రేపు విత్తన మేళా

ఇబ్రహీంపట్నం: రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ వర్సిటీలో శుక్రవారం విత్తనాల మేళా(సీడ్స్ మేళా)ను నిర్వహిస్తున్నట్లు ఇబ్రహీంపట్నం వ్యవసాయ విస్తరణ అధికారి శ్రవణ్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ వర్సిటీలు, పలు కంపెనీల ఏజెన్సీలు, వివిధ రకాల నాణ్యమైన విత్తనాలను ఈ మేళాలో ప్రదర్శిస్తారని.. అవసరమైన వారు కొనుగోలు చేయవచ్చునన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మట్టి తరలింపుపై ఇరిగేషన్ శాఖ ఫిర్యాదు

కేశంపేట: నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తరలిస్తున్నట్లు కేశంపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయింది. ఈ ఘటన మండల పరిధిలోని బైర్కాన్‌పల్లి శివారులో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం పోసముంద్రం చెరువులో ఓ రైతు ఇతర వ్యక్తుల సహకారంతో అక్రమంగా మట్టిని తరలిస్తున్నాడు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకుని జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇరిగేషన్ శాఖ క్లస్టర్ లింగం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లింగం తెలిపారు.

ఏఎంసీలో ఏమైంది?

సాక్షి ఎఫెక్ట్..

లక్డీకాపూల్: నిమ్స్ ఆస్పత్రిలోని పాత అక్యూట్ మెడికల్ కేర్ (ఏఎంసీ)లో ఏసీలు పని చేయకపోవడంపై బుధవారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన వార్తా కథనానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ స్పందించింది. దీనిపై వివరణ ఇవ్వాలని నిమ్స్ మెడికల్ సూరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ సత్యనారాయణను ఆదేశించింది. దీంతో నిమ్స్ యాజమాన్యం ఏఎంసీలోని పరిస్థితులపై సంజాయిషీ ఇచ్చింది. ఈ మేరకు బుధవారం వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శికి రాసిన లేఖ ప్రతులను మీడియాకి విడుదల చేశారు. నిమ్స్‌లోని అక్యూట్ మెడికల్ కేర్ (ఏఎంసీ)లో ప్రస్తుతం ఉన్న ప్యాకేజీ యూనిట్లు(ఏసీ) పురాతనమైనవి కారణంగా పనిచేయడం లేదని, మరమ్మతులు చేసినా ఫలితం కన్పించడం లేదని లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుత ప్యాకేజీ యూనిట్లను మరింత సమర్థవంతమైన డక్టబుల్ యూనిట్‌లతో భర్తీ చేయడానికి రూ.12.50 లక్షల వ్యయంతో అంచనా వేశామని తెలిపారు. ఈ మేరకు నిపుణుల అభిప్రాయం కోసం అంతర్గత కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్‌ను దృష్టిలో ఉంచుకుని టెండర్లు వేయడం కుదరదని అడ్మినిస్ట్రేషన్ సూచించిందని, ఈ కారణంగా తీవ్ర అనారోగ్యంతో ఉన్నవారిని తాత్కాలికంగా అదే బ్లాక్‌లోని పాత ఐసీయూకి మార్చాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా..బుధవారం సాయంత్రానికల్లా ఏసీలను తాత్కాలికంగా మరమ్మతు చేయించారు. దీంతో పనిచేయడం మొదలు పెట్టాయని రోగుల బంధువులు పేర్కొన్నారు. 'సాక్షి' పుణ్యమా అని తమకు ఉపశమనం లభించిందని ఓ రోగి సహాయకుడు దానియేల్ సంతృప్తి వ్యక్తం చేశారు.


పకడ్బందీగా కౌంటింగ్ ఏర్పాట్లు



ఓట్ల లెక్కింపు రిహార్సల్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనుదీప్

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల కౌంటింగ్‌ను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు హైదరాబాద్ పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులకు తెలిపారు. బుధవారం హైదరాబాద్ ఆబిడ్స్ జీహెచ్ఎంసీ సర్కిల్ ఆఫీసులో నిర్వహించిన గోషామహల్ అసెంబ్లీ సెగ్మెంట్ ఏంకోర్ డాటా ఎంట్రీ(డమ్మీ) రిహార్సల్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపును ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. కౌంటింగ్‌కు 14 టేబుల్స్ ఏర్పాటు చేసి కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో ఓట్ల లెక్కింపు నిర్వహించాలని సూచించారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా పటిష్టవంతంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు. గుర్తింపు కార్డు ఉన్నవారిని మాత్రమే లోపలికి అనుమతించాలని తెలిపారు. ఈ సమావేశంలో నోడల్ ఏఆర్ఓ విక్టర్, డిప్యూటీ కలెక్టర్ అండ్ ఏఆర్ఓ ఎస్. విద్యాధర్, తహసీల్దార్, ప్రేమ్ కుమార్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

భూమి ఇక పిరమే!



సాక్షి స్పెషల్ స్టోరీ

కొత్త ప్రభుత్వ ప్రతిపాదనలపై భిన్నాభిప్రాయాలు

- 'విలువ' పెంచితే సామాన్యులపై పెనుభారం
- ఎల్ఆర్ఎస్, రిజిస్ట్రేషన్ చార్జీలూ పెరుగుతాయ్
- క్రయవిక్రయాలపైనా ప్రభావం
- ఇప్పటికే ఏడాది కాలంగా తిరోగమనంలో స్థిరాస్తి మార్కెట్
- సొంతింటి కల కష్ట సాధ్యమే...

భూమి రేట్లు పెరిగితే ఆ మేరకు 14 శాతం ఎల్ఆర్ఎస్ ఛార్జీలు, 7.5 శాతం రిజిస్ట్రేషన్

ఇది తరుణం కాదు...

ఫీజులు కూడా చెల్లించాల్సిందే. ఇది సామాన్య, మధ్యతరగతికి అదనపు భారం పడుతుంది. ఆదాయాన్ని పెంచుకోవాలని ప్రభుత్వం భావించడం సమంజసమే అయినా ప్రస్తుతం రాష్ట్రంలో స్థిరాస్తి రంగం స్తబ్దుగా ఉందని, ఇలాంటి పరిస్థితుల్లో పెంపు సరికాదని స్థిరాస్తి వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

సాక్షి, రంగారెడ్డి జిల్లా: అసలే స్థిరాస్తి రంగం తిరోగమనంలో ఉంది. సామాన్యులకు సొంతింటి కల అందనంత దూరంలో ఉంది. ఇప్పటికే పెరిగిన ధరల కారణంగా మధ్యతరగతి ప్రజలు గూడు కోసం జాగా కొనుక్కోవడం కష్టంగా మారింది. ఈ తరుణంలో తెలంగాణలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వం భూముల విలువ పెంచాలని నిర్ణయించడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భూముల విలువ పెంచితే ఎల్ఆర్ఎస్, రిజిస్ట్రేషన్ చార్జీలు సైతం భారీగా పెరుగుతాయి. ఇది క్రయ విక్రయాలపై ప్రభావం చూపుతుందని రియల్ ఎస్టేట్ వ్యాపారులు అంటున్నారు. ఏడాది కాలంగా స్తబ్దుగా ఉన్న స్థిరాస్తి మార్కెట్ మరింత కుదేలయ్యే ప్రమాదం ఉందని అంటున్నారు. ప్రభుత్వం మాత్రం తెలంగాణలో భూముల విలువ..వాస్తవ విలువకు చాలా తేడా ఉందని..పెంచితేనే రిజిస్ట్రేషన్ల శాఖకు ఆదాయం పెరుగుతుందని అంటోంది.

తేడా ఎంతంటే..

- కీసరలో ప్రభుత్వ విలువ గజానికి రూ.3 వేలుగా ఉంది. ఇక్కడ వంద గజాల స్థలానికి రూ.3 లక్షల వైట్ మనీతో పాటు స్టాంప్ డ్యూటీ రూపంలో రూ.22,500 చెల్లించాలి. భూముల విలువను ఈ ప్రాంతంలో 50 శాతం పెంచిందనుకుంటే.. వందగజాల ప్లాట్‌కు రూ.4.50 లక్ష ల వైట్‌మనీ తో పాటు స్టాంప్ డ్యూటీ రూపంలో 33,700 చెల్లించాలి. అంటే భూమి విలువ రూ.1.50 లక్షలు, స్టాంప్ డ్యూటీ రూపంలో రూ.11,200 అదనపు భారం పడుతుందన్నమాట.
- జూబ్లీహిల్స్‌లో ప్రభుత్వ విలువ గజానికి రూ.66 వేలుగా ఉంది. ఇక్కడ వంద గజాలు కొనాలంటే రూ.66 లక్షల వైట్‌మనీతో రూ.4.95 లక్షలు స్టాంప్‌డ్యూటీ చెల్లిస్తే సరిపోతుంది. ఇక్కడ ప్రభుత్వ విలువ 50 శాతం మేర పెంచితే.. అప్పుడు వంద గజాల స్థలానికి రూ.కోటి అవుతుంది. అప్పుడు రూ.కోటి వైట్‌మనీ మీద స్టాంప్ డ్యూటీ రూ.7.50 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. అంటే రూ.36.55 లక్షలు అదనపు భారం పడుతుందన్నమాట.

సమాంతర రేటు సరికాదు..

నగరంలోని కొన్ని ప్రాంతాల్లో భూముల ధరలు ప్రభుత్వ విలువ, మార్కెట్ రేటుకు మధ్య చాలా వ్యత్యాసం ఉంది. మాదాపూర్, కొండాపూర్, కోకాపేట, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, తెల్లాపూర్, పుప్పాలగూడ వంటి పశ్చిమ హైదరాబాద్ ప్రాంతాల్లో ఈ వ్యత్యాసం మరింత ఎక్కువగా ఉంది. ఇలా స్థలాల రేట్లు భూమికి, ఆకాశానికి ఉన్నంత తేడా ఉన్న ప్రాంతాల్లో ఎక్కువగా పెంచాలి. దీంతో సామాన్యునిపై భారం పడకుండా ఉండటంతో పాటు ప్రభుత్వానికి అనుకున్న ఆదాయ లక్ష్యాన్ని చేరుకుంటుంది. అలా కాకుండా అన్ని ప్రాంతాల్లో సమాంతర స్థాయిలో విలువలను పెంచితే సామాన్యుడిపై అధిక భారం పడుతుంది. శామీర్‌పేట, ఆదిభట్ల, ఉప్పల్, ఘట్‌కేసర్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం వంటి సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా కొనుగోలు చేసే ప్రాంతాల్లో భూముల విలువలు పెంచితే సామాన్యుల మీదే భారం పడుతుంది.

గత పరిస్థితులు వేరే..

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత 2014 నుంచి 2021 వరకు అప్పటి ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచలేదు. 2021 జులైలో తొలిసారిగా భూముల విలువలను, రిజిస్ట్రేషన్ ఫీజును సవరించింది. అప్పటి వరకు మార్కెట్ విలువపై 6 శాతంగా ఉన్న రిజిస్ట్రేషన్ ఫీజును 7.5 శాతానికి పెంచింది. భూముల విలువలను సైతం వ్యవసాయ భూమికి ఎకరాకు చొప్పున, ఖాళీ ప్లాట్లకు చదరపు గజాల చొప్పున, ఇళ్లు, అపార్ట్‌మెంట్లకు చదరపు అడుగుల చొప్పున కనీస ధర నిర్ణయించడంతో పాటు మార్కెట్ విలువను సవరించింది. అయితే అప్పటివరకు మార్కెట్‌లో పెరిగిన ధరలతో పోలిస్తే ప్రభుత్వ ధరల పెంపు ప్రభావం పెద్దగా కనిపించలేదు. ఆ తర్వాత 2022 ఫిబ్రవరిలోనూ మరోసారి భూముల విలువను సవరించింది. కానీ, ప్రస్తుతం రాష్ట్రంలో పరిస్థితులు వేరు. గతేడాది సెప్టెంబర్ నుంచి వరుస ఎన్నికల నేపథ్యంలో మార్కెట్ స్తబ్దుగా ఉంది. కొత్త ప్రభుత్వం వచ్చి రాగానే ఫార్మాసిటీ రద్దు, జిల్లాల కుదింపు వంటి నిర్ణయాలతో స్థిరాస్తి మార్కెట్ దెబ్బతింది. పైగా కరువు పరిస్థితుల నేపథ్యంలో క్రయవిక్రయాలపై ప్రభావం చూపిస్తుంది. గత ఏడాది కాలంగా స్థిరాస్థి మార్కెట్ తిరోగమనంలో సాగుతుంది. ఇలాంటి సమయంలో భూముల విలువను పెంపు నిర్ణయం సరికాదని రియల్ ఎస్టేట్ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

సొంతింటి కల దూరం



భూముల రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచితే పేద, మధ్య తరగతి ప్రజలకు సొంతింటి కల దూరమే. ప్రభుత్వం ఆదాయాన్ని పెంచుకునేందుకు రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచడం వల్ల సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతారు. బహిరంగ మార్కెట్ విలువకు, ప్రభుత్వ ధరకు వ్యత్యాసం ఉన్న మాట వాస్తవమే. పేదలపై భారం పడకుండా ప్రత్యేక దృష్టి సారించాలి.

– బిక్కునాయక్, కడ్తాల్

విలువ పెంచితే భారం



ప్రభుత్వం భూముల విలువ పెంచే ప్రయత్నం చేస్తుంది. ఇప్పటికే వ్యాపారం అంతంత మాత్రమే ఉంది. విలువ పెంచితే మరింత ప్రభావం పడుతుంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్ విలువకు, ప్రభుత్వ మార్కెట్ విలువకు వ్యత్యాసం ఉంది. భూముల విలువ పెంచితే మాత్రం సామాన్య, మధ్యతరగతి వారికి భారం అవుతుంది.

– గడ్డం వెంకట్‌రెడ్డి, రియల్ వ్యాపారి, మొయినాబాద్



చందానగర్ పాఠశాల రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ శశాంక

పనుల్లో వేగం పెంచండి

కలెక్టర్ శశాంక

మొయినాబాద్: పాఠశాలలు తెరిచేనాటికి అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపడుతున్న పనులను త్వరితగతిన పూర్తిచేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని చందానగర్, నాగిరెడ్డిగూడ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. టాయిలెట్స్ నిర్మాణం, విద్యుత్ ఏర్పాట్ల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నిధులు మంజూరైనఅమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. జూన్ 12 నాటికి పనులన్నీ పూర్తి చేయాలన్నారు. అనంతరం పాఠశాలల్లో రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ గౌతమ్‌కుమార్, ఎంపీడీఓ సంధ్య, ఎంఈఓ వెంకటయ్య తదితరులు ఉన్నారు.

ఎర్లీ 'డిమాండ్'!

- ఆస్తిపన్ను వసూళ్ల కోసం 'నోటీసులు'
- ముందస్తుగానే జారీ చేస్తోన్న జీహెచ్ఎంసీ

సాక్షి, సిటీబ్యూరో: 'ఎర్లీబర్డ్' గురించి తెలుసు కానీ.. ఎర్లీ డిమాండ్ ఏమిటనుకుంటున్నారా ? ఇదీ ఆస్తిపన్ను వసూళ్లకు సంబంధించిందే. ఆర్థిక సంవత్సరం ఆరంభమయ్యే ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి నెలాఖరు వరకు ఆస్తిపన్ను చెల్లించే వారికి 5 శాతం రాయితీ ఉండటమే ఎర్లీబర్డ్ పథకమని తెలిసిందే. ప్రతియేటా ఎర్లీబర్డ్ ముగిశాక ఎర్లీబర్డ్ స్కీమ్‌ను వినియోగించుకోని మిగతా వారికి జూలైలోనో ఆగస్టులోనో ఆస్తిపన్ను చెల్లించాల్సిందిగా జీహెచ్ఎంసీ డిమాండ్ నోటీసులు జారీ చేసేది. ఆ తర్వాత రెడ్ నోటీసులు జారీ చేసేది. ఈసారి అందుకు భిన్నంగా ఏప్రిల్ నెలాఖరుతో ఎర్లీబర్డ్ ముగియగానే, డిమాండ్ నోటీసుల జారీ చర్యలకు శ్రీకారం చుట్టి ప్రస్తుతం వాటిని జారీ చేస్తోంది. గతంలో లేని విధంగా ఎర్లీగా డిమాండ్ నోటీసులు జారీ చేస్తోంది. తద్వారా ఇళ్ల యజమానులకు నెలకు 2 శాతం వడ్డీ భారం తగ్గుతుందని పేర్కొంటున్నారు. జీహెచ్ఎంసీ ఖజానాకు సైతం తగిన మొత్తంలో నిధులు జమ కాగలవని ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

ఆదాయం పెరుగుతున్నా..

ఏటికేడు జీహెచ్ఎంసీకి ఆస్తిపన్ను ద్వారా వచ్చే ఆదాయం పెరుగుతున్నా.. ఖర్చులు అంతకుమించి పెరుగుతుండటంతో సిబ్బంది జీతాల నుంచి కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపుల వరకు జాప్యం జరుగుతోంది. జీతాల చెల్లింపుల్లో జాప్యం ఉండరాదని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలుండటంతో చెల్లించక తప్పని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆస్తిపన్ను చెల్లించాల్సిన అందరి నుంచీ పన్ను వసూలు చేసేందుకు జీహెచ్ఎంసీ ఈ సంవత్సరం ఎర్లీగానే డిమాండ్ నోటీసులు జారీ చేస్తోంది. ఈ సంవత్సరం రూ.2200 కోట్ల ఆస్తిపన్ను వసూలు లక్ష్యంగా ఉంది. ఎర్లీబర్డ్‌ను వినియోగించుకోవడం ద్వారా 7.34 లక్షల మంది ఇళ్ల యజమానులు రూ.827 కోట్ల ఆస్తిపన్ను చెల్లించారు. ఆ తర్వాత కూడా చెల్లిస్తున్నవారున్నప్పటికీ పరిస్థితి మందకొడిగా ఉంది.

రూ.20 కోట్ల కంటే తక్కువ వసూలైన సర్కిళ్లు

సర్కిల్	వసూలు (రూ.కోట్లు)
ఉప్పల్	16.10
మలక్‌పేట	14.62
సంతోష్‌నగర్	6.06
చాంద్రాయణగుట్ట	2.78
చార్మినార్	5. 35
ఫలక్‌నుమా	3.11
రాజేంద్రనగర్	19.72
మెహదీపట్నం	17.38
కార్వాన్	8.39
ముషీరాబాద్	17.54
యూసుఫ్‌గూడ	12.50
గాజుల రామారం	13.39
అల్వాల్	15.35
సికింద్రాబాద్	11.04

- ఈ సర్కిళ్ల నుంచి తక్కువ ఆస్తిపన్ను వసూలైంది. డిమాండ్ నోటీసులు, ఎస్ఎంఎస్‌లతో అలర్ట్ చేయడం వల్ల ఈ సర్కిళ్లే కాక మిగతా సర్కిళ్ల నుంచి కూడా ఆస్తిపన్ను చెల్లిస్తారని, తద్వారా కొన్ని పనులకైనా ఈ నిధులు వినియోగించుకోవచ్చునని అధికారులు భావన.





రాయపోల్ కొనుగోలు కేంద్రం వద్ద వడ్ల రాశులు

వరి కుప్పలు.. తిప్పలు

- కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల నిరీక్షణ
- లేబర్, లారీల కొరత
- అకాల వర్షాలకు మొలకెత్తుతున్న ధాన్యం
- ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు



తడిసి మొలకెత్తిన ధాన్యం

ఇబ్రహీంపట్నం: ఆరుగాలం శ్రమించి పంట పండించే అన్నదాతలకు అవస్థలు తప్పడంలేదు. విద్యుత్, సాగు నీటి కొరతలతో సతమతమైరేయింబవళ్లు కష్టపడి పంట పండిస్తే.. అధికార యంత్రాంగ సకాలంలో ధాన్యం సేకరించడంలో విఫలమవుతోంది. రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల వద్దే రైతులు పడిగాపులుకాస్తున్నారు. ధాన్యం తరలించడంలో జాప్యంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మండల పరిధిలోని రాయపోల్, దండుమైలారం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఇబ్బందులు వర్ణనాతీతం. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారే తప్ప మౌలిక సదుపాయల కల్పనలో విఫలమయ్యారని రైతులు ఆరోపిస్తున్నారు. హమాలీల కొరత, ధాన్యం లోడ్‌ను తీసుకెళ్లే లారీలను, వడ్లను తూర్పార బట్టే యంత్రాలు అందుబాటులో ఉంచక రైతులు ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు అకాల వర్షాలు అన్నదాతను మరింత ఇబ్బంది పెడుతున్నాయి. కొనుగోలు కేంద్రాల వద్దనే ధాన్యం తడిసి మొలకెత్తుతోంది. ఒక్క టార్పాలిన్ కవర్‌కు రోజుకు రూ.35 అద్దె చెల్లించి ధాన్యం తడవకుండా కప్పుతున్నారు. అదేవిధంగా గంటకు రూ.వెయ్యి చెల్లించి వడ్లను తూర్పార బట్టిస్తున్నారు. గిట్టుబాటు ధరను చూసుకుంటే మరింత నష్టాలకు గురికావాల్సివస్తుందని కొంతమంది రైతులు ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకే ధాన్యాన్ని విక్రయించారు. ప్రభుత్వ యంత్రాంగం కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా సేకరించి మిల్లులకు తరలించాలని రైతులు వేడుకుంటున్నారు.

కలెక్టర్, అదనపు కలెక్టర్లకు సమస్యల ఏకరవు

కొనుగోలు కేంద్రాల పనితీరుపై వస్తున్న విమర్శల నేపథ్యంలో కలెక్టర్ శశాంక్, అదనపు కలెక్టర్ ఎంపీ భూపాల్‌రెడ్డి మంగళవారం మండల పరిధిలోని ఆయా కేంద్రాలను వేర్వేరుగా సందర్శించారు. ఇబ్బందులను తెలుసునే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. సివిల్ సప్లై, డీసీఎంఎస్, డీసీఓ, అగ్రికల్చర్ అధికారులకు పలు సూచనలు చేసి, వేగవంతంగా ధాన్యం సేకరణ చేపట్టాలని కలెక్టర్, అడిషనల్ కలెక్టర్‌లు ఆదేశాలు జారిచేయడం గమనార్హం.

నెల రోజులుగా ఇక్కడే



ధాన్యం తీసుకొని వచ్చి నెలరోజులు దాటింది. హమాలీల కొరత, లోడ్‌ను తీసుకెళ్లేందుకు ఒకే లారీ ఉండటంతో కొనుగోళ్లు ఆలస్యమవుతున్నాయి. అకాల వర్షాలకు ధాన్యం తడిసి మరింత ఇబ్బంది పడ్డాం తూర్పారబట్టే వడ్లకు గంటకు వెయ్యి రూపాయలు చెల్లిస్తున్నాం. ధాన్యం తూకం వేసి వెంటనే తరలించాలి.

– భారతమ్మ, రాయపోల్


కొనుగోలులో జాప్యం



ధాన్యం కొనుగోలులో తీవ్ర జాప్యం జరుగుతుంది. పగలు ఎండలు రాత్రి అకాల వర్షాలకు ధాన్యం తడిసి నష్టపోతున్నాం. రూ.35కు ఒక్క ప్లాస్టిక్ కవర్స్‌ను తీసుకువచ్చి ధాన్యంపై కప్పుతున్నా భూమి కింది నుంచి వచ్చే పదనుతో వడ్లు మొలకెత్తుతున్నాయి.

– సత్తయ్య, రాయపోల్

తూకం వేయట్లే



ముకునూర్ గ్రామ పరిధిలోని నా వ్యవసాయ క్షేత్రం నుంచి కొనుగోలు కేంద్రానికి వడ్లు తీసుకు వచ్చా. కానీ ఇక్కడ తూకం వేయట్లే. అకాల వర్షాలకు ధాన్యం తడిసి మొలకెత్తి నష్టపోతున్నాం. సుమారు 20 రోజులుగా కొనుగోలు కేంద్రం వద్దనే ధాన్యంతో నిరీక్షిస్తున్నాం. ఎప్పటికప్పుడు వడ్లను సేకరించి రైతుల ఇబ్బందులు తీర్చండి.

– జంగయ్య, రాయపోల్.

బీజేపీ నేతపై దాడికి యత్నం?

- కారును వెంబడించిన ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన తిరుపతిరెడ్డి

మీర్‌పేట: ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు కర్రలతో మంగళవారం రాత్రి బీజేపీ నాయకుడిని వెంబడించిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం. మీర్‌పేట నందిహిల్స్ పరిధిలోని చైతన్యహిల్స్‌కు చెందిన స్థానిక బీజేపీ నాయకుడు ద్యాసాని తిరుపతిరెడ్డి రాత్రి 11గంటలకు కారులో ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో ఓ ద్విచక్రవాహనంపై ముగ్గురు వ్యక్తులు కర్రలతో కారును వెంబడించారు. గమనించిన తిరుపతి రెడ్డి ఇంటి వద్దకు రాగానే వాహనం దిగకుండా అలాగే ముందుకు వెళ్లడంతో వచ్చిన వ్యక్తులు కర్రలను అక్కడే వదిలేసి వెళ్లిపోయారు. తిరుపతి రెడ్డి డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలికి వచ్చి పరిశీలించారు. తనపై దాడి చేసేందుకు ఇంటి వరకు వెంబడించారని తిరుపతిరెడ్డి మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ వెంకట్రాంరెడ్డి తెలిపారు. వచ్చిన వారు ముఖానికి మాస్కులు ధరించారని, కేసు నమోదు చేసుకుని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నామని, దర్యాప్తు పూర్తయిన తరువాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్‌ఐ తెలిపారు.

54 మంది విద్యార్థులకు 'ఎన్ఎంఎంఎస్'

చేవెళ్ల/మొయినాబాద్: చేవెళ్ల ఆదర్శ పాఠశాలకు చెందిన 32 మంది విద్యార్థులు, ఇర్విన్ జెడ్పీహెచ్ఎస్ నుంచి 22మంది నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు(ఎన్ఎంఎంఎస్) ఎంపికయ్యారు. వీరికి 8వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ పూర్తయ్యే వరకు ప్రతీ సంవత్సరం రూ.12వేల చొప్పున ఉపకారవేతనం అందుతుందని ఇర్విన్ పాఠశాల హెచ్ఎం పర్వతాలు తెలిపారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్‌ల సంఘం నాయకులు

- ఆ తర్వాతే గ్రామ పంచాయతీ ఎన్నికలు
- రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం నాయకుల డిమాండ్
- ఎన్నికల సంఘం కమిషనర్‌కు వినతిపత్రం

కడ్తాల్: రాష్ట్రంలో గత ఐదేళ్లుగా ఎన్నో అభివృద్ధి పనులు చేసినా, నేటికి బిల్లులు అందక సర్పంచ్‌లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు వెంటనే పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ దగ్గర పడుతున్న నేపథ్యంలో గత సర్పంచ్‌లకు రావాల్సిన బిల్లులు విడుదల చేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర నాయకులు బుధవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ పార్థసారథిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. గత ఐదేళ్లుగా గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలు, రైతు వేదికలు, డంపింగ్ యార్డులు, సీసీ రోడ్లు, అంతర్గత రోడ్లు, వీధి లైట్లు, అంతర్గత మురుగు కాల్వలు, క్రీడా ప్రాంగణాలు, పారిశుద్ధ్య నిర్వహణ మొదలైన కార్యక్రమాలను చేపట్టడంలో సర్పంచ్‌లు కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. ఎంతో కష్టపడి గ్రామాలను అభివృద్ధి చేసినా సర్పంచ్‌లకు చెల్లించాల్సిన బిల్లులు విషయంలో ప్రభుత్వం జాప్యం చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. పెండింగ్ బిల్లుల విషయమై పలుమార్లు ప్రభుత్వానికి వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం జేఏసీ కమిటీ అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రణీల్ చందర్, ఉపాధ్యక్షుడు గుంటి మధుసూధన్‌రెడ్డి, నాయకులు అమరేందర్‌రెడ్డి, రమేశ్, కరుణాకర్, రామకృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని.. వ్యక్తి మృతి

తలకొండపల్లి: ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన విషాద ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీకాంత్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చౌదర్‌పల్లికి చెందిన కూరాకుల మల్లేశ్(40) బుధవారం ఆమనగల్లు నుంచి బైక్‌పై స్వగ్రామానికి వస్తున్నారు. మార్గమధ్యలో జంగారెడ్డిపల్లి గ్రామ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న మహేశ్వరం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మల్లేశ్ తలకు తీవ్రంగా గాయమైంది. దీంతో ఆయన అక్కడికక్కడే దుర్మరణం చెందారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య వరలక్ష్మితో పాటు ఇద్దరు పిల్లలున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కల్వకుర్తి ఆస్పత్రికి తరలించారు. మల్లేశ్ ఆకస్మిక మృతితో చౌదర్‌పల్లిలో విషాదచాయలు అలుముకున్నాయి.


ఘటనాస్థలంలో మల్లేశ్ మృతదేహం

ప్రాణం తీసిన ఈత సరదా

బావిలో నీటమునిగి బార్బర్ మృతి


సాయి (ఫైల్)

మాడ్గుల: ఈత సరదా ఓ యువకుడిని పొట్టన పెట్టుకుంది. లోతు అంచనా తెలియక బావిలో దూకిన అతడు అనంత లోకాలకు వెళ్లాడు. ఈ విషాద సంఘటన మండల పరిధిలోని నల్లచెరువు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన నాగిళ్ల సాయి(21) హెయిర్ సెలూన్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆయన మంగళవారం ఉదయం తోటి మిత్రులతో కలిసి నల్లచెరువు గ్రామంలో ఉన్న నారాయణబావిలోకి ఈతకు వెళ్లారు. సాయికి లోతు తెలియక దూకడంతో అడుగున ఉన్న ఒండ్రు, కొర్రీల నడుమ చిక్కుకున్నారు. ఎంత సేపటికి సాయి బయటకు రాకపోవడంతో స్నేహితులు కంగారు పడి స్థానికులు, పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే గాలింపు చర్యలు ప్రారంభించి విగతజీవిగా పడి ఉన్న సాయి మృతదేహాన్ని వెలికి తీశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యువకుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వృద్ధుడి అదృశ్యం


జంగయ్య (ఫైల్)

ఆమనగల్లు: పట్టణానికి చెందిన జంగయ్య అనే వృద్ధుడు అదృశ్యమైనట్లు ఆమనగల్లు ఎస్ఐ బాల్‌రాం తెలిపారు. పట్టణానికి చెందిన నిఖిల్ ఇంటికి జంగయ్య ఈనెల 20న వచ్చాడని, 21న ఉదయం ఇంటిలో నుంచి వెళ్లిన ఆయన తిరిగి రాలేదన్నారు. జంగయ్య మానసికస్థితి సరిగా లేదని ఆయన మనవడు నిఖిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అసంపూర్తి పనులు.. అవస్థల్లో ప్రజలు

- మండల వ్యాప్తంగా పలు రోడ్ల దుస్థితి
- పట్టించుకోని అధికార యంత్రాంగం

నందిగామ: గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు హడావుడిగా నిధులు మంజూరు చేశారు.. టెండర్లు సైతం పూర్తి చేశారు.. కొత్త రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు.. ఉన్న రోడ్డును తవ్వేశారు.. మా గ్రామాలకు రోడ్డు సౌకర్యం మెరుగు పడుతుందని అందరూ ఆశించారు.. కానీ వాస్తవంగా కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిపోయిన చందంగా దాపురించింది మండలంలోని కొన్ని గ్రామాల రోడ్ల దుస్థితి. కొత్త రోడ్డు సంగతి దేవుడెరుగు ఉన్న రోడ్డును తవ్వేయడంతో అటు కొత్త రహదారి లేక, ఇటు ఉన్న రోడ్డులో కంకర పరచడంతో వాహనదారులు మూలుగుతూనే ప్రయాణం సాగిస్తున్నారు.

▲ మండల కేంద్రమైన నందిగామలోని పాత జాతీయ రహదారి నుంచి గ్రామం మధ్యలో రోడ్డు వెడల్పు చేసి బైపాస్ వరకు రెండు వరుసల రహదారిగా నిర్మించేందుకు ప్రక్రియ ప్రారంభించారు. అప్పట్లో బిట్లుగా విభజించి హెచ్ఎండీఏ నిధులు రూ.40 లక్షలు, బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.35 లక్షలు నిధులు మంజూరు చేసి పనులు మొదలు పెట్టారు. కానీ గ్రామం బయటి వరకు రోడ్డు వేసి బైపాస్ నుంచి కంకర పరిచి బీటీ వేయకుండా వదిలేశారు.

▲ మండల కేంద్రమైన నందిగామ నుంచి నర్సప్పగూడ వరకు రూ.3 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు మంజూరు అయింది. రోడ్డు పనులను ప్రారంభించి కొంత మేర రోడ్డు వేసి మరికొంత మేర అలాగే కంకర పరిచి వదిలేశారు.

▲ మొదళ్లగూడ గ్రామ శివారులోని సింబయాసిస్ యూనివర్సిటీ మీదుగా మంచన్ పహాడ్ గ్రామానికి వెళ్లే రహదారి సైతం సగం వరకు రోడ్డు వేసి మరికొంత మేరకు అర్థాంతరంగా వదిలేశారు. దీంతో మంచన్ పహాడ్ గ్రామానికి వెళ్లాలంటే అవస్థలు పడుతున్నారు.

▲ ఈదులపల్లి నుంచి శ్రీనివాసులుగూడ మీదుగా మసీద్ మామిడిపల్లి వరకు రూ.1.90 కోట్లతో బీటీ రోడ్డు మంజూరు అయింది. కానీ ఇక్కడా కంకర పరిచి బీటీ వేయకపోవడంతో ప్రస్తుతం కంకర తేలిపోయింది.


నందిగామ నుంచి బైపాస్ వెళ్లే రోడ్డులో పరిచిన కంకర

తరచూ ప్రమాదాలు

కంకర వేసిన రహదారుల గుండా ప్రయాణం చేసేటప్పుడు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొత్త రోడ్డు నిర్మాణం పనులు ఏమో గానీ ఉన్న రోడ్డును తవ్వేసి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కల్గించారని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంకర పరిచి వదిలేయడంతో ప్రస్తుతం రాళ్లు తేలి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని.. దీంతో తరచూ ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయని ఆందోళన చెందుతున్నారు. మండలంలోని రోడ్ల పరిస్థితి దారుణంగా ఉందని ఎమ్మెల్యే శంకర్ దృష్టి సారించాలని స్థానికులు వేడుకుంటున్నారు.


నందిగామ-నర్సప్పగూడకు వెళ్లే రహదారి ఇలా..

త్వరలోనే ప్రారంభిస్తాం

మండలంలోని పలు గ్రామాల్లో రోడ్ల పనులు అర్థాంతరంగా నిలిచిపోయిన మాట వాస్తవమే. ఎన్నికలు జరగడం, బిల్లుల చెల్లింపులో జాప్యం కారణంగా కాంట్రాక్టర్లు పనులు పెండింగ్‌లో పెట్టారు. ప్రస్తుతం ఎన్నికలు ముగిశాయి. వెంటనే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించేందుకు కృషి చేస్తాం.

– హేమంత్ ఏఈ, పంచాయతీరాజ్, నందిగామ

తీవ్ర అవస్థలు



నందిగామ నుంచి నర్సప్పగూడకు రోడ్డు కొంత మేరకు వేసి మరికొంత కంకర పరిచి వదిలేశారు. దీంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. కంకర రోడ్డుపై తేలిపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుంది. అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలి.

– కాట్న సురేందర్, నర్సప్పగూడ

ఠాణా ఎదుట ద్విచక్ర వాహనం దగ్ధం



పంజగుట్ట: పంజగుట్ట పోలీస్ స్టేషన్ బయట పార్కింగ్‌లో స్థలంలో ద్విచక్ర వాహనం మంటల్లో కాలిపోయింది. ఈ వాహనం పక్కనే ఉన్న మరో వాహనం పాక్షికంగా ధ్వంసమైంది. పోలీసుల సమాచారం మేరకు.. అంబర్‌పేటకు చెందిన మహ్మద్ హమీద్ అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనాన్ని పంజగుట్ట పోలీస్‌స్టేషన్ బయట పార్క్ చేసి పని నిమిత్తం బోయిన్‌పల్లికి వెళ్లాడు. మధ్యాహ్నం వాహనంలోంచి ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు రాసాగాయి. గమనించిన పోలీసులు, స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే వాహనం కాలిపోయింది. పక్కనే ఉన్న మరో వాహనం పాక్షికంగా కాలింది. సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బయటకు వెళ్లే వ్యక్తి ఠాణా ఎదుట వాహనాన్ని ఎందుకు పార్క్ చేశాడు? అనే అంశాన్ని ఆరా తీస్తున్నామన్నారు.

సీజ్ చేసిన ఇసుక వేలం

తాండూరు టౌన్: మండల పరిధిలో సీజ్ చేసిన ఇసుకను ఈనెల 24న బహిరంగ వేలం వేయనున్నట్లు తహసీల్దార్ తారాసింగ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తాండూరు మండలం చెన్‌గేష్‌పూర్ గ్రామంలోని సర్వే నంబర్ 83లో నిల్వ చేసిన 101 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేశామన్నారు. ఇట్టి ఇసుకను సీజ్ చేసిన స్థలంలోనే శుక్రవారం బహిరంగ వేలం వేయనున్నట్లు చెప్పారు. ఆశావహులు పాల్గొనాలని తహసీల్దార్ తెలిపారు.

25, 26 తేదీల్లో 'సమ్మర్ డే క్యాంప్'

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని బొటానికల్ గార్డెన్‌లో ఈ నెల 25, 26వ తేదీల్లో 'సమ్మర్ డే క్యాంప్' నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇందులో అందరికీ అవకాశం కల్పిస్తారు. ఒక్కొక్కరు రూ.499 చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా ప్రకృతిలో విహరించేందుకు అవకాశం కల్పించడమే కాకుండా థీమ్ పార్కుల సందర్శించేందుకు ఏర్పాట్లు చేశారు. గోల్ఫ్ కోర్సు ఆడేందుకు కూడా అవకాశం కల్పిస్తారు. ప్రకృతి, పర్యావరణ విద్యకు సంబంధించిన చిన్న నిడివి కలిగిన వీడియోలను తిలకించవచ్చు. ఆహ్లాదాన్ని పంచే అడ్వెంచర్ గేమ్స్‌లో పాల్గొనేందుకు కూడా అవకాశం కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు. వివరాలకు 94935 49399, 93463 64583లను సంప్రదించవచ్చు.

25న 'నేచర్ క్యాంప్'

బొటానికల్ గార్డెన్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా నేచర్‌క్యాంప్-ఫారెస్ట్రైక్‌పార్క్ కార్యక్రమాన్ని కూడా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ క్యాంప్‌లో టీమ్ బిల్డింగ్ యాక్టివిటీస్, టెంట్లలో క్యాంపు నిర్వహణ, ఫైర్‌క్యాంప్, నేచర్‌వాక్, ట్రెక్కింగ్, బర్డ్‌వాక్, వంటివి ఏర్పాటు చేస్తారు. 25వ తేదీన సాయంత్రం 4 గంటలకు పాల్గొనేవారు ఈ క్యాంప్‌లో చేరవచ్చు తిరిగి మరుసటి రోజు ఉదయం 10 గంటల వరకు క్యాంప్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందులో పాల్గొనేవారు 12 ఏళ్లు పైబడిన వారు రూ.1800, 5 నుంచి 12 ఏళ్లున్న వారు రూ.1200 చెల్లించాల్సి ఉంటుంది.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో వినూత్న శిక్ష

వృద్ధులకు మందులు కొనుగోలు చేయాలన్న జడ్జి

అనంతగిరి: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ముగ్గురికి వికారాబాద్ న్యాయస్థానం వినూత్న తీర్పు ఇచ్చింది. వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 20న వికారాబాద్ మున్సిపల్ పరిధిలో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టారు. ఈ డ్రైవ్‌లో ముగ్గురు మద్యం తాగి పట్టుబడ్డారు. కాగా బుధవారం వికారాబాద్ స్పెషల్ మార్నింగ్ కోర్టు మెజిస్ట్రేట్ ఎదుట హాజరయ్యారు. న్యాయమూర్తి నామాల అశోక్ ముగ్గురికి రూ. 2వేల చొప్పున జరిమానా విధించారు. దాంతో పాటు వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులకు మందుల కొనుగోలుకు రూ.వెయ్యి, పండ్ల కొనుగోలుకు మరో రూ.వెయ్యి చొప్పున చెల్లించాలని తీర్పు ఇచ్చారు. దీంతో ముగ్గురితో కలిసి జడ్జి మున్సిపల్ పరిధిలోని కొంపల్లి సమీపంలోని వృద్ధాశ్రమానికి వెళ్లారు. అక్కడ వారితో పండ్లు పంపిణీతో పాటు మందులకు నగదును ఇప్పించారు. అనంతరం వృద్ధుల యోగా క్షేమాలను అడిగి తెలుసుకుని జడ్జి వారికి రూ.10వేల ఆర్థికసాయాన్ని అందించారు.


వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేస్తున్న జడ్జి అశోక్

బీఆర్ఎస్ నేతలపై అట్రాసిటీ కేసు

అక్రమం అంటూ డీఎస్పీ కార్యాలయాన్ని ముట్టడించిన నాయకులు

పరిగి: ఎలాంటి ఎంక్వైరీ లేకుండానే అట్రాసిటీ కేసులు ఎలా నమోదు చేస్తారని బుధవారం పరిగి డీఎస్పీ కార్యాలయం ఎదుట భారీగా జనాలు గుమిగూడారు. పూడూర్ మండలం కడ్మూర్ గ్రామంలో ఈనెల 13న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య మాటల యుద్ధం జరిగింది. దీంతో గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నేతలు సురేష్, మాణిక్యం, లింగం, రవికుమార్, మహేందర్‌లపై ఈనెల 14న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు బుధవారం ఉదయం నలుగురిని అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గ్రామానికి చెందిన పలువురు పూడూర్ పోలీస్‌స్టేషన్ ముట్టడి చేసి అక్కడినుంచి పరిగి డీఎస్పీ కార్యాలయానికి తరలివచ్చి అక్రమంగా ఎందుకు అరెస్టు చేశారని నిలదీశారు. అధికార పార్టీ ఇష్టానుసారంగా అక్రమంగా నలుగురిపై అట్రాసిటీ కేసు ఎలా చేస్తారన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు కావాలనే బీఆర్ఎస్ నాయకులపై అక్రమంగా కేసులు నమోదు చేస్తున్నారన్నారు. ఈ విషయం మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా మాజీ ఎమ్మెల్యే డీఎస్పీ కార్యాలయానికి వచ్చి పోలీసు అధికారులతో వివరాలు అడిగి తెలుసుకుని వెళ్లారు.

నిర్మాణాలకు సరైన ఎంపిక 'భారతి'

సంస్థ సీనియర్ టెక్నికల్ ఇంజనీర్ నితీశ్‌యాదవ్

అబ్దుల్లాపూర్‌మెట్: వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్ 5స్టార్ గ్రేడ్‌ను తెలంగాణలో విడుదల చేసిందని ఆ సంస్థ సీనియర్ టెక్నికల్ ఇంజనీర్ నితీశ్ యాదవ్ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం రాత్రి రుద్రా స్టీల్ ఏజెన్సీ, డీలర్ షాప్‌లో తాపీమేస్త్రీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందన్నారు. అల్ట్రాఫస్ట్ ముఖ్యంగా స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు, రహదారులకు సరైన ఎంపిక అన్నారు. అల్ట్రాఫాస్ట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందచేస్తామని స్లాబ్ కాంక్రిట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజనీర్లు సైట్ వద్దకే వచ్చి సహాయపడుతారని ప్రకటించారు. ఈ సందర్భంగా 50 మంది తాపీ మేస్త్రీలకు రూ.లక్ష ప్రమాద బీమా బండ్లను అందజేశారు. డీలర్ నాగార్జునయాదవ్ మాట్లాడుతూ.. భారతి సిమెంట్ సర్వీస్ చాలా వేగంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ మార్కెటింగ్ రామకృష్ణ, టెక్నికల్ ఆఫీసర్ బద్రి, సామ్రాట్, తాపీమేస్త్రీలు పాల్గొన్నారు.


తాపీమేస్త్రీలకు బీమా పత్రాలను అందజేస్తున్న భారతి సిమెంట్ ప్రతినిధులు

నిషేధిత పత్తి విత్తనాల పట్టివేత

- ఆటోలో తరలిస్తుండగా పట్టుకున్న ఎస్ఓటీ పోలీసులు
- రూ.6 లక్షల విలువ చేసే 240 కిలోల విత్తనాలు స్వాధీనం


దాడిలో పట్టుబడ్డ విత్తనాలు

మొయినాబాద్: నిషేధిత పత్తి విత్తనాలను తరలిస్తున్న ఆటోను ఎస్ఓటీ, శంకర్‌పల్లి పోలీసులు పట్టుకున్నారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని రూ.6 లక్షల విలువ చేసే 240 కిలోల నిషేధిత విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం వెలిమల గ్రామానికి చెందిన శివశంకరరావు, శంకర్‌పల్లి మండలం ఎల్వర్తికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి, శంకర్‌పల్లికి చెందిన ఉదయ్‌కిరణ్, హరిబాబు నలుగురు వ్యాపారం నిమిత్తం ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలుకు చెందిన విత్తనాల సప్లయర్ శ్రీనివాస్‌రావుని కలిసి బీజీ-ఐఐఐ/హెచ్‌టీ(ప్రభుత్వం నిషేధించిన) పత్తి రకం విత్తనాలను కిలో రూ.2,500 చొప్పున రూ.6 లక్షల విలువ చేసే 240 కిలోలు కొనుగోలు చేశారు. వాటిని ఆటోలో తరలిస్తుండగా బుధవారం తెల్లవారు జామున శంకర్‌పల్లి మండలం ఎల్వర్తి సమీపంలో రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు, శంకర్‌పల్లి పోలీసులు సంయుక్తంగా దాడి చేసి పట్టుకున్నారు. ఆటో డ్రైవర్‌తోపాటు శివశంకర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, ఉదయ్‌కిరణ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న 240 కిలోల నిషేధిత పత్తి విత్తనాలు, సెల్‌ఫోన్, రూ.2500 నగదు స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు సప్లయర్ శ్రీనివాస్‌రావు, హరిబాబు పరారీలో ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పైన పటారం.. లోన లొటారం

- హోటళ్లలో ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు
- లోపించిన పరిశుభ్రత
- గడువు ముగిసిన ఆహార పదార్థాలు

బంజారాహిల్స్: సోమాజిగూడలోని పలు హోటళ్లలో ఫుడ్‌సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ టీమ్ అధికారులు బుధవారం తనిఖీలు చేపట్టారు. సోమాజిగూడ కృతుంగది పాలేగర్స్ క్యూజిన్ రెస్టారెంట్‌లో తనిఖీలు నిర్వహించి లైసెన్స్, లోగో లేకుండా గంగా గోల్డ్ పన్నీర్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. గడువు ముగిసిన మెంతి మలాయి వాడుతున్నట్లు గుర్తించారు. 156 వాటర్ బాటిళ్లను నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తుండటంతో సీజ్ చేశారు. నాన్ వెజ్ పేస్ట్‌తో పాటు ఇతర ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. పరిశుభ్రతను బేఖాతర్ చేస్తూ ఇష్టానుసారంగా హోటల్ కొనసాగుతున్నట్లుగా గుర్తించారు. అలాగే.. సోమాజిగూడలోని రెస్టో ఓ బార్‌లో కూడా తనిఖీలు చేసిన అధికారులు నిబంధనలు పాటించకుండా వాడుతున్న పలు ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. కిచెన్‌లో పరిశుభ్రత పూర్తిగా లోపించినట్లుగా గుర్తించారు. మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేదని కూడా తేలింది. వెజిటేరియన్, నాన్ వెజిటేరియన్ పదార్థాలు ఫ్రిజ్‌లో ఒకేచోట భద్రపరిచినట్లుగా తేలింది. సింథటిక్ ఫుడ్ కలర్స్ వినియోగిస్తున్నట్లు కూడా గుర్తించారు. కేఎఫ్‌సీలో కూడా అధికారులు తనిఖీలు నిర్వహించి ఫుడ్‌సేఫ్టీ లైసెన్స్‌ను గుర్తించిన చోట ప్రదర్శించకుండా నిర్లక్ష్యం వహించారని నోటీసులు ఇచ్చారు. ఈ హోటళ్లన్నీ పరిశుభ్రత లేకుండానే కిచెన్‌లో ఆహార పదార్థాలను తయారు చేస్తున్నారని, అధ్వానంగా ఉన్నట్లు కూడా అధికారుల తనిఖీల్లో వెల్లడైంది. ఆయా హోటళ్లకు అధికారులు నోటీసులు జారీ చేశారు. పలు ఆహార పదార్థాలను సీజ్ చేశారు.


హోటల్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఫుడ్‌సేఫ్టీ అధికారులు